## క్లుప్తంగా

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కమిషనర్ ఆనంద్‌కుమార్



**సత్తెనపల్లి:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవని మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని రంగా కాలనీలో పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, ఇళ్లల్లోని చెత్త చెదారాన్ని రోడ్లపై, కాలువల్లో పడవేయకుండా శానిటేషన్ కార్మికులకు అందించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రతలో ప్రత్యేకత చూపించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, సిబ్బంది ఉన్నారు.

### 18న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**అచ్చంపేట:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయ్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు గత మూడు నెలల ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

### జాతీయ అవార్డు గ్రహీత మురళికి సత్కారం



**సత్తెనపల్లి:** జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డుకు ఎంపికైన సత్తెనపల్లి 31వ వార్డుకు చెందిన కర్నాటి మురళిని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం సన్మానించారు. పట్టణంలోని 31వ వార్డులోని మురళి ఇంటి వెళ్లి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో ఇక్కత్ డిజైన్లపై శిక్షణ ఇస్తున్న మురళి ఆగస్టు 7న ఢిల్లీలో భారత్ భవనంలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకోనున్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తానవలి, 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరిగ్రేస్, నాయకులు మార్నెళ్ల మల్లేశ్వరరావు, మునిని బాబు, మార్నెళ్ల స్వామి, కొత్రపు శ్రీను ఉన్నారు.

### పిల్లలకు ఆదరణ, రక్షణ అవసరం

**సత్తెనపల్లి:** పిల్లలకు ఆదరణ, రక్షణ అవసరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉమాదేవి అన్నారు. పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి డివిజన్ స్థాయి అడ్వైజరీ అవేర్‌నెస్ ట్రైనింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శౌరిబాబు మాట్లాడుతూ జువనైల్ జస్టిస్ యాక్ట్ 2000లో వచ్చిందని, ఈ యాక్ట్ 2001 నుంచి ప్రారంభించబడిందన్నారు. పిల్లలు లేని వారికి పిల్లలను దత్తత ఇవ్వడం జరుగుతుందని, పిల్లల హక్కులు కాపాడాలన్నారు. పిల్లలకు స్వేచ్ఛను ఇవ్వాలని, చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీలత, ఏసీడీపీవో టి.సంతోష్ కుమారి, పీవోఎన్ఐసీ కృష్ణారెడ్డి, సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### యువత వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

హెచ్ఎం కళ్యాణి



**అచ్చంపేట:** యువత వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని, అది భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని స్థానిక టీఎస్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్ఎం చిగురుపాటి కళ్యాణి అన్నారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, రోల్ ప్లే తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమ నచ్చిన పనిలో ప్రావీణ్యత సాధించేందుకు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులకు కుటుంబ పోషణలో ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో వృత్తి విద్యా శిక్షణదారులు ఎస్.శ్రీకాంత్, జి.ప్రశాంతరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అందని సుఖీభవ.. ఆందోళనలో అన్నదాత

- మండలంలో 10 వేలకు పైగా రైతుల ఈ కేవైసీ పూర్తి
- అన్నదాత సుఖీభవపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం



పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

**క్రోసూరు:** కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడు రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14 వేలు, పీఎం కిసాన్ రూ.6 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పేరుతో ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క విడత కూడా అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయకపోవటంతో రైతన్నలు ఆ డబ్బులు ఎప్పుడు పడతాయా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఏటా తూచాతప్పకుండా రైతు భరోసా డబ్బులు నేరుగా రైతుల ఖాతాలో పడటంతో రైతులు పంటల సాగు అవసరాలకు ఇబ్బందులు పడలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అధికారంలోకి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ అన్నదాత సుఖీభవ డబ్బులు ఇంతవరకు పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ కేవైసీ చేయించాలని...**

రైతులందరూ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలని లేకుంటే అన్నదాత సుఖీభవ ఆర్థిక సహాయం పడదంటూ వ్యవసాయ శాఖ అధికారులు ముమ్మర ప్రచారం చేసి రైతుల లిస్టులు తయారు చేయటం జరిగింది. ఈ కేవైసీ చేసుకున్న రైతులందరూ అన్నదాత సుఖీభవ కొరకు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడటం తప్ప డబ్బులు మాత్రం పడలేదని పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అధికారులు మాత్రం అన్నదాత సుఖీభవ గురించి తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని చెబుతున్నారు.

### మండలంలో 10 వేలకు పైగా రైతులు

మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 సచివాలయాల (21 గ్రామ పంచాయతీలు) పరిధిలో 10,084 మంది రైతులు ఈ కేవైసీ చేయించుకుని అన్నదాత సుఖీభవ ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14 వేలు, అదేవిధంగా కేంద్రం అందించే పీఎం కిసాన్ ఆర్థిక సహాయం రూ.6 వేలు కలిపి ఏడాదికి రూ.20 రైతులకు అందిస్తామని చెప్పడం తప్పితే ఆచరణకు మాత్రం నోచుకోలేదని రైతులు చెబుతున్నారు. పీఎం కిసాన్ నిధులు క్రమం తప్పకుండా పడుతున్నా కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్నా అన్నదాత సుఖీభవపై స్పష్టత ఇవ్వటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ వచ్చింది. దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కొంత మంది రైతులు అక్కడక్కడ తొలకరి వర్షాలకు విత్తనాలు కూడా వేసారు. ఈ సమయంలో రైతన్నలకు ఖర్చులు అధికంగా ఉంటాయి. ఖర్చులు తట్టుకోవాలంటే చేతిలో నగదు అవసరం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి అన్నదాత సుఖీభవ ఆర్థిక సహాయం త్వరగా అందజేయాలని రైతులు కోరుతున్నారు.

### నా దగ్గర సమాచారం లేదు



అన్నదాత సుఖీభవ ఆర్థిక సహాయం రైతులకు ఎప్పుడు వేస్తారన్న సమాచారం నా వద్ద లేదు. అధికారికంగా తెలిసిన వెంటనే తెలుపగలను.

– వి.వేణుగోపాల్, ఏవో, క్రోసూరు

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**సత్తెనపల్లి:** సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మూడోరోజు మంగళవారం సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం నుంచి పురవీధుల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో మోకాళ్లపై కూర్చొని నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నం.36 ప్రకారం జీతం చెల్లించాలని, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. సమ్మెలో భాగంగా వీధి దీపాలు, వాటర్ సప్లై, అండర్ గ్రౌండ్ వాటర్ వర్క్స్, పట్టణ ప్రణాళిక విభాగంలోని పనులు నిలిపివేస్తామని, ఈ కారణంగా పట్టణ ప్రజలకు కలుగు అసౌకర్యాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఇంజనీరింగ్ కార్మికులు ఉన్నారు.

## చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం

పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి



ఇనిమెట్ల గ్రామ సచివాలయంలో డ్వాక్రా గ్రూపు సభ్యులను విచారిస్తున్న పీడీ

**రాజుపాలెం:** డ్వాక్రా గ్రూపుల సొమ్ము వాడుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఝాన్సీరాణి అన్నారు. మండలంలోని ఇనిమెట్ల గ్రామ సచివాలయంలో నాగమ్మ డ్వాక్రా మహిళా సంఘం గ్రూపులో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం గ్రూపు సభ్యులను విచారించారు. గ్రూపు సభ్యులు, ఏపీఎం శివకుమార్, సీసీ రాంప్రసాద్‌ను విచారించారు. నాగమ్మ డ్వాక్రా గ్రూపుకు సంబంధించిన డబ్బులను యానిమేటర్ మస్తాన్‌వలి కాజేసినట్లు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఇనిమెట్లలోని డ్వాక్రా గ్రూపుల వివరాలను సేకరించి విచారణ చేసి నివేదికను సమర్పించాలని, ఏపీఎంను, సీసీని ఆదేశించినట్లు తెలిపారు. విచారణ అనంతరం డబ్బులు కాజేశాడని తేలితే మస్తాన్‌వలిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ, నాయకులు కూచిపూడి రమేష్ మాదిగ, డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యువత నైపుణ్యాలను కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి

**సత్తెనపల్లి:** మన దేశ యువతలో ఓర్పు, నేర్పు ఎక్కువగా ఉంటాయని, దానికి సంకల్ప బలం తోడైతే ఎలాంటి నైపుణ్యాలనైనా సులువుగా నేర్చుకోవచ్చని ప్రభుత్వ స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం కార్యక్రమం ప్రిన్సిపాల్ రమేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నైపుణ్యాలను కలిగి ఉన్నప్పుడు వికసిత్ భారత్ దిశగా యువత ముందుకు సాగుతారన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ దేశ సంపద యువత అని, వారు మంచి ఆలోచన విధానంతో నైపుణ్యాలను కలిగి ఉన్నప్పుడు భవిష్యత్తు బాగుంటుందన్నారు. ముందుగా యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బట్లూరు, శ్రీలక్ష్మీ పాలీ క్లినిక్ వైద్యులు జక్క సిద్ధార్థ, కరూర్ వైశ్య బ్యాంకు సేల్స్ అండ్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ శాఖమూరి నవ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు పంట సాగు పత్రాలు పొందాలి



గోళ్లపాడు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి

**గోళ్లపాడు(ముప్పాళ్ల):** కౌలు రైతులందరూ భూయజమానుల అంగీకారంతో పంట సాగు హక్కు పత్రాలు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని గోళ్లపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏవో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువుల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏఈవో వి.నారాయణ, ఎంపీఈవో డేవిడ్, రైతులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం**

**నకరికల్లు:** మండలంలోని చల్లగుండ్ల, అడ్డరోడ్డులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ యోజన కోసం జూలై ఆఖరునాటికి ప్రీమియం చెల్లించాలన్నారు. ఆగస్టు 15వ తేదీలోగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఈ కె.దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

**నెమలిపురిలో 'పొలం పిలుస్తోంది'**

**రాజుపాలెం:** మండలంలోని నెమలిపురిలో వరి నారుమడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.వెంకట నర్సయ్య మాట్లాడుతూ నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో రెండు దఫాలు దమ్ము చేసి చదును చేయాలని, నీరు పెట్టడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఐదు సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజనిని రెండు దఫాలుగా విత్తనం చల్లే ముందు ఒక కిలో, 12 రోజులు దాటిన తరువాత మరో కిలో చల్లాలని సూచించారు. దుక్కిలో ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ చల్లాలని తెలిపారు. నారు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరుతడిగా నీరు నిల్వ కట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎస్కే మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

## ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ



**క్రోసూరు:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్య సిబ్బంది క్రోసూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవం నినాదం 'ప్రణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఇది కేవలం మాతృత్వ సంబంధిత ఆరోగ్యానికి కాకుండా కుటుంబ సంక్షేమానికి కూడా అవసరం అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వివాహ వయసు ఆడబిడ్డకు 21, మగ బిడ్డకు 25 సంవత్సరాలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భూలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

**సత్తెనపల్లి:** ఉద్యాన శాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్, సాగుపై అవగాహన సదస్సు ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, అలాగే పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ.వెంకటరావు, గోద్రెజ్ డీజీఎం జి.మురళీధర్, సత్తెనపల్లి ఉద్యాన అధికారి ఎన్.సురేష్, గోద్రెజ్ కంపెనీ సత్తెనపల్లి ఎఫ్‌టీసీ కె.నాని హాజరవుతారన్నారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు, కొత్తగా సాగు చేయదలచుకున్న రైతులు సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

## విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



**నకరికల్లు:** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ ఎన్ఎస్ఎస్ అపర్ణ హెచ్చరించారు. నకరికల్లులోని విత్తనాల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాక్‌బోర్డులు, స్టాక్ రిజిస్టర్‌లు నిర్వహించాలన్నారు. రైతులకు అమ్మకందారు, కొనుగోలుదారు సంతకాలతో రసీదులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.కన్నయ్య, నకరికల్లు, అచ్చంపేట వ్యవసాయ శాఖ అధికారులు కె.దేవదాసు, పి.వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



**పెదకూరపాడు:** మండల పరిధిలోని 75త్యాళ్ళూరు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సీమ్యాట్ లెక్చరర్, రాష్ట్ర పరిశీలకులు పి.రమేష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. అటల్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్, పీఎం శ్రీలో జరుగుతున్న లైబ్రరీ వర్క్, రాంప్ రైలింగ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లే ఫీల్డ్ తదితర పనులు, స్కూల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ ఫ్రేమ్ వర్క్, ఎండీఎం ఇతర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను వినియోగించుకొని పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు, ఏఈ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి జోలికొస్తే క్రిమినల్ చర్యలు

తహసీల్దార్ కె.పుల్లారావు



వైఎస్సార్ జగనన్న కాలనీ–2లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ పుల్లారావు, అధికారులు

**నకరికల్లు:** నకిలీ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.పుల్లారావు హెచ్చరించారు. నకరికల్లులోని వైఎస్సార్ జగనన్న కాలనీ–2లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 124 మందికి పట్టాలు మంజూరు చేశారు. కాగా కాలనీలోని నివేశన స్థలాలు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమణలకు పాల్పడుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు దానిపై దృష్టి సారించారు. మంగళవారం జగనన్న కాలనీ–2లో ప్రభుత్వ స్థలాలు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లారావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న కాలనీలో లబ్ధిదారుల ప్లాట్లు, కమ్యూనిటీ అవసరాల కోసం కేటాయించిన భూమి ఆక్రమణకు గురవుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, కట్టుబడి చేసేందుకు యతించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలకు పాల్పడుతున్న వారి సమాచారాన్ని కార్యాలయంలో అందించాలని సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పట్టా పొందిన వారు కట్టుబడి చేసే ముందుగా కార్యాలయంలో పట్టా తనిఖీ చేయించుకొని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ సిద్దయ్య, వీఆర్వో పాశం శారద, సర్వే సిబ్బంది ఉన్నారు.

## సీపీఐ మహాసభను జయప్రదం చేయండి

పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ



అచ్చంపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

**అచ్చంపేట:** పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతిలో ఈ నెల 20వ తేదీన జరిగే సీపీఐ 16వ మహాసభకు అశేషంగా ప్రజానీకం తరలి వచ్చి జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం అచ్చంపేటలో కరపత్రాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పట్ల పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి అందలం ఎక్కిన ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. అనంతరం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌బుజ్జి, పట్టణ కార్యదర్శి సంపంగుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల వాడకం తగ్గించాలి

డీఆర్సీ డీడీఏ శివకుమారి



మాట్లాడుతున్న డీఆర్సీ డీడీఏ శివకుమారి

**పెదకూరపాడు:** రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా డీఆర్సీ డీడీఏ శివకుమారి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించి జీవన ఎరువుల వినియోగం పెంచాలన్నారు. మిరప, ఇతర పంటలు సాగు చేసే రైతులందరూ పీఎండీఎస్ విత్తనాలు వేసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాలు పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకుని, పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలన్నారు. పురుగు మందులు కూడా విచ్చలవిడిగా వాడరాదన్నారు. మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పంటల బీమా గురించి వివరించారు. డీఆర్సీ ఏవో అరుణ్ కుమారి, సర్పంచ్ గుడిపూడి రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు వై బ్రహ్మయ్య, డీసీ చైర్మన్ వి.అప్పారావు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, రాష్ట్ర అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత దర్శి శేషారావు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## క్రమం తప్పక ఏఆర్‌టీ మందులు వాడాలి



లింక్ ఏఆర్‌టీ ప్లస్ సెంటర్‌లో హెచ్ఐవీ వైద్య పరీక్షల్లో డాక్టర్ లక్ష్మణరావు

**సత్తెనపల్లి:** హెచ్ఐవీతో జీవిస్తూ ఏఆర్‌టీ మందులు వాడే ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని సకాలంలో మందులు వాడటం ద్వారా ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఏరియా ఆసుపత్రిలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లింక్ ఏఆర్‌టీ ప్లస్ సెంటర్‌లో బీపీ, షుగర్, సీరం క్రియాటిన్, హెపటైటిస్ బీ, సీ తదితర ఉచిత వైద్య పరీక్షలు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఏఆర్‌టీ మందులు వాడే వారు ప్రతి ఆరు నెలలకు విధిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యశాల ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇక్కడ ప్రతి నెల వైరల్ లోడ్ సీడీ 4, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని, ఏఆర్‌టీ మందులు వాడే వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ బాషా మాట్లాడుతూ ప్రతి రోజు ఏఆర్‌టీ మందులు ఓకే సమయానికి వాడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ మహబూబ్ సుబాని, స్టాఫ్‌నర్స్ అనూష, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్నకుమార్, సార్డ్స్ సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆదామ్, సిబ్బంది, వీహెచ్ఎస్ ప్రతినిధి విజయ్ చందర్, హెచ్‌టీసీ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రోసూరు విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు



**క్రోసూరు:** క్రోసూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని షేక్ నజ్మాకు శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు మంగళవారం తెలిపారు. నజ్మా 10వ తరగతిలో 566 మార్కులు సాధించిందని తమ పాఠశాల విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులతో కలిసి ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు, తండ్రి నాగులుమీరా పాల్గొన్నారు.

## విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యం

చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు చిట్టా సాయి బ్రాహ్మణి



పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న చిట్టా సాయి బ్రాహ్మణి

**సత్తెనపల్లి:** విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు చిట్టా సాయి బ్రాహ్మణి చెప్పారు. సత్తెనపల్లిలో చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని శబరిగిరి అపార్ట్‌మెంట్‌లో 24వ వార్డ్ కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ అధ్యక్షతన మంగళవారం పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. 2013 నుంచి తన తండ్రి విజయభాస్కర్ రెడ్డి, పెదనాన్న కృష్ణజ్వాలా రెడ్డి, బాబాయ్ బాపూజీ రెడ్డి, సోదరుడు భరద్వాజ రెడ్డిల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు, పేద పిల్లలకు ఆర్థిక సహాయం, రక్తదానం.. ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. సీనియర్ న్యాయవాదులు దాసరి జ్ఞానరాజ్ పాల్, మర్రి సుబ్బారెడ్డి, రాజవరపు శివనాగేశ్వరరావు, చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ విజయ్‌కుమార్‌లు మాట్లాడారు. అనంతరం ప్రతిభ గల 20 మంది పేద విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ జలీలు, తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, ఉల్లంగుల ప్రసాదు, పింగళి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.